
సాక్షి
పల్నాడు
మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి సోమవారం చిలకలూరిపేట గణపవరానికి చెందిన గ్రంథి శ్రీనివాసరావు కుటుంబం రూ. 1,01,116 విరాళాన్ని అందించింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 519.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 4,050 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వైభవంగా పోలేరు తల్లి తిరునాళ్ల



రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడులో గ్రామ దేవత పోలేరు తల్లి తిరునాళ్లను సోమవారం నిర్వహించారు. గ్రామస్తులు పొంగళ్లు చేసి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త చాగంటి శ్రీనివాసరెడ్డి, సభ్యులు పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

యువత భరోసా కోసం ఉద్యోగాల కల్పనకు చర్యలు



చినగంజాం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువత భరోసా కోసం 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సోమవారం చినగంజాం మండలం కొత్తగొల్లపాలెం గ్రామంలో ఏర్పాట్లను రాష్ట్ర సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, చీరాల శాసన సభ్యులు ఎం.ఎం. కొండయ్య, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, జిల్లా కలెక్టర్ జే వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జేసీ ప్రఖర్‌జైన్ పాల్గొన్నారు.

గుంటూరు నగరంలో ఎస్పీ పర్యటన



నగరంపాలెం: గుంటూరు నగర పరిసర ప్రాంతాల్లో సోమవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆకస్మికంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణను ఆయన పరిశీలించారు. పట్టాభిపురం పీఎస్ పరిధిలోని పట్టాభిపురం, కోబాల్డ్‌పేట మసీదులు, లాలాపేట పీఎస్ పరిధిలోని ఎత్తురోడ్డు మసీదు, పాత గుంటూరు పీఎస్ పరిధిలోని ఆంధ్ర ముస్లిం కళాశాల, నగరంపాలెం పీఎస్ పరిధిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి సమీపంలోని ఈద్గాల వద్ద బందోబస్తును పరిశీలించారు. ప్రార్థనలు ముగిసే వరకు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రార్థనలు ముగిశాక ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు ఆయన సూచించారు. రంజాన్ పర్వదిన సందర్భంగా మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు చేసుకునేలా ఆయా ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట సీఐలు ఎ.అశోక్‌కుమార్ (తూర్పు ట్రాఫిక్ పీఎస్), సింగయ్య (పశ్చిమ ట్రాఫిక్ పీఎస్), వైవీ.సోమయ్య (పాతగుంటూరు పీఎస్), పోలీస్ అధికారులు ఉన్నారు.

జెస్సీరాజ్‌కు పతకాలు



మంగళగిరి: తైవాన్‌లో ఈనెల 26 నుంచి 31 వరకు జరిగిన తైవాన్ ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్ స్కేటింగ్ పోటీలలో మంగళగిరికి చెందిన జెస్సీరాజ్ అద్భుత ప్రతిభ కనపరచింది. సోలో డ్యాన్స్, కపుల్ డ్యాన్స్ విభాగాలలో రెండు గోల్డ్ మెడల్స్, పెయిర్ స్కేటింగ్‌లో సిల్వర్, ఇన్ లైఫ్ ఫ్రీ స్టైల్‌లో బ్రాంజ్ మెడల్ సాధించింది. సోమవారం విజేత జెస్సీరాజ్‌కు ఏషియన్ ఆర్టిస్ట్ స్కేటింగ్ చైర్మన్ అలెక్స్ వాంగ్ పతకాలు అందజేసి అభినందించారు.

నేడు యథావిధిగా టెన్త్ సోషల్ స్టడీస్ పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: రంజాన్ పండుగ సెలవు కారణంగా వాయిదా పడిన 10వ తరగతి సోషల్ స్టడీస్ పరీక్ష మంగళవారం యథావిధిగా జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం మంగళవారం ఆప్షనల్ హాలిడేగా ప్రకటించినప్పటికీ, టెన్త్ సోషల్ పరీక్ష జరుగుతుందని తెలిపారు. మంగళవారం గుంటూరు జిల్లావ్యాప్తంగా 150 కేంద్రాల పరిధిలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగే సోషల్ స్టడీస్ పరీక్షకు విద్యార్థులు హాజరయ్యే విధంగా చూడాలని ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ఆమె సూచించారు.

పాత కోటయ్యా..

నిను చేరేదెలాగయ్యా !

- కోటప్ప కొండ ప్రధాన ఆలయం నుంచి పాత కోటేశ్వర ఆలయానికి మెట్ల దారి నిర్మాణానికి గత ప్రభుత్వంలో ప్రణాళికలు
- రెండు వేల మెట్లు ఏర్పాటు చేయాలని అంచనా
- దేవస్థానం నిధులతో పాటు భక్తుల నుంచి విరాళాలతో నిర్మాణాలు చేపట్టేలా ప్రదిపాదనలు
- 'మెట్టుకో దాత' పేరిట భక్తులు నుంచి ఒక్కోమెట్టుకు రూ.20 వేలు విరాళం సేకరించాలని నిర్ణయం
- విరాళాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న దాతలు
- కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాలంటున్న భక్తులు



రుద్ర శిఖరంపై పాత కోటయ్య స్వామి ఆలయం (ఇన్‌సెట్) పాత కోటయ్య స్వామి

సాక్షి, నరసరావుపేట/ నరసరావుపేట రూరల్ : త్రికూటాద్రిలో దక్షిణామూర్తిగా దర్శనమిచ్చే పాత కోటేశ్వరస్వామిని మెట్ల మార్గం ద్వారా వెళ్లి దర్శించుకోవాలని భక్తుల చిరకాల కోరిక. దాన్ని నెరవేర్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ప్రణాళికలు సిద్ధం చేశారు. అప్పటి నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎస్పీ రవి శంకర్‌రెడ్డి, డీఎఫ్‌ఓ రామచంద్రరావు, ఆలయ ఈఓ వేమూరి గోపి మెట్ల మార్గ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయడంలో కీలకపాత్ర పోషించారు. దాతలు, దేవస్థానం నిధులతో ఏడాదిలోగా పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. నిర్మాణానికి ఎంతో కీలకమైన అటవీ శాఖ అనుమతులు కోసం దరఖాస్తు చేశారు. అయితే, రెండేళ్లు అవుతున్నా అడుగు ముందుకు పడలేదు.

స్వామి దర్శనానికి అవస్థలు

త్రికూటాద్రిలో రుద్ర శిఖరంపై పాత కోటయ్య స్వామి ఆలయాన్ని భక్తులే అభివృద్ధి చేసుకుంటూ వచ్చారు. కోటప్ప కొండపై ఇప్పటి వరకు ప్రధాన ఆలయం వరకే మెట్ల మార్గం ఉంది. కొండ శిఖరాన కొలువైన పాత కోటేశ్వరుడి ఆలయానికి వెళ్లడానికి ప్రస్తుతం మార్గం లేదు. శివరాత్రి సమయంలో, ముఖ్యమైన రోజుల్లో రాళ్లు, ముళ్ల పొదల వెంబడి భక్తులు కొండ ఎక్కి గుడిని చేరతారు. దేవదాయ శాఖ తాగునీరు, విద్యుత్ సౌకర్యం మాత్రమే కల్పించింది.

ఆధ్యాత్మికం, పర్యాటకంగా అభివృద్ధి

ప్రధాన ఆలయం నుంచి పాత కోటేశ్వరస్వామి ఆలయం వరకు దాదాపు 2,000 మెట్లు పడతాయని అధికారులు అంచనా వేశారు. పది అడుగుల వెడల్పుతో నిర్మించే మార్గంలో ఐదు అడుగులు కొండపైకి వెళ్లడానికి, ఐదు అడుగులు కొండ దిగటానికి వేరు చేసేలా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రతి 50 మెట్లకు ఓ చోట భక్తులు, పర్యాటకులు సేదతీరడానికి బల్లలు ఏర్పాటుతో పాటు అక్కడక్కడా నీడ కోసం రేకులతో షెడ్ నిర్మాణం, తాగునీరు అందుబాటులో ఉంచాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. మెట్ల మార్గం పూర్తయితే పాత కోటేశ్వరుడి ఆలయం అభివృద్ధి పనులకు మోక్షం కలగనుంది. మెట్ల మార్గంతో కోటప్పకొండ ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా మరింత అదనపు ఆకర్షణగా నిలవనుంది.

అటవీ శాఖ అనుమతులు ఆలస్యం

మెట్ల మార్గం నిర్మాణాన్ని అటవీ శాఖ భూముల నుంచి చేపట్టాల్సి ఉంది. దీని కోసం సంబంధిత శాఖ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో ఫైల్‌ను కేంద్ర అటవీ శాఖకు పంపారు. ఇప్పటి వరకు క్లియర్ కాలేదు. కూటమి నాయకులు ఆసక్తి చూపడం లేదు. సనాతన ధర్మం కోసం పాటుపడుతున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్ర అటవీ శాఖ మంత్రిగా, కేంద్రంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా స్థానిక ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కీలక పదవుల్లో ఉన్నప్పటికీ అనుమతులు రాకపోవడంపై భక్తుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

‘మెట్టుకో దాత’ పేరిట విరాళాలు

పాత కోటయ్య స్వామి దర్శనాన్ని భక్తులకు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి భావించారు. త్రికోటేశ్వర స్వామి ఆలయం నుంచి పాత కోటయ్య స్వామి ఆలయానికి మెట్ల మార్గం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనిపై అధికారులు సర్వే కూడా పూర్తిచేశారు. 'మెట్టుకో దాత' పేరిట ప్రత్యేక కార్యక్రమం రూపొందించారు. ఇందులో భాగంగా దాతల నుంచి రూ.20 వేలు స్వీకరించనున్నారు. ఆ మెట్టుపై దాత పేరును చెక్కుతారు. మెట్ల మార్గ నిర్మాణానికి విరాళాలు ఇవ్వడానికి కొందరు ప్రజాప్రతినిధులు, భక్తులు ముందుకు వచ్చారు. ఓ భక్తుడు 200 మెట్లు, మరో భక్తుడు 108 మెట్ల చొప్పున ప్రతిపాదనలు సిద్ధమైన ఒక్క రోజే దాదాపు రూ.కోటి విరాళం ఇవ్వడానికి ముందుకు వచ్చినట్టు ఆలయ అధికారులు అప్పట్లో వెల్లడించారు.


కూటమి ప్రభుత్వ వైఫల్యం



“గత ప్రభుత్వంలో మెట్ల మార్గానికి అవసరమైన డీపీఆర్‌ను సిద్ధం చేశాం. దాతలు కూడా విరాళాలు అందించేందుకు ముందుకు వచ్చారు. ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వాలు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నాయి. ప్రభుత్వాలు ఏర్పడి సంవత్సరం అవుతున్నా ఇప్పటి వరకు అటవీ అనుమతులు కూడా తీసుకురాలేకపోయారు.

–డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నరసరావుపేట

అనుమతులు కోసం ప్రయత్నం



మెట్ల మార్గం నిర్మాణం మొదలు పెట్టాలంటే అటవీ శాఖ భూమిని దేవస్థానానికి అప్పగించాల్సి ఉంటుంది. ఇందు కోసం అనుమతులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. కొద్ది నెలల్లోనే ప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నాం.

–డి.చంద్రశేఖర్, ఈవో, కోటప్పకొండ దేవస్థానం”

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ తుషార్ దూడీ



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ

చినగంజాం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఆయన సోమవారం చినగంజాం మండలంలోని కొత్త గొల్లపాలెంలో పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం మొత్తం 904 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని వీరిలో ఒకరు అడిషనల్ ఎస్పీ, ఏడుగురు డీఎస్పీలు, 27 మంది సీఐలు, 67 మంది ఎస్ఐలు ఉన్నారన్నారు. బందోబస్తును 11 సెక్టార్లుగా విభజించామన్నారు. అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన ప్రదేశాలలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ సమర్థంగా విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, బాపట్ల, చీరాల, రేపల్లె సీసీఎస్ డీఎస్పీలు రామాంజనేయులు, మొయిన్,శ్రీనివాసరావు,జగదీష్ నాయక్‌లు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు గోపురం పనులకు రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు గుంటూరుకు చెందిన భక్తులు సోమవారం రూ.లక్ష విరాళాన్ని అందచేశారు. గుంటూరు జిల్లా వడ్డేశ్వరానికి చెందిన కె.కోటేశ్వరరావు అమ్మవారి ఆలయ బంగారు తాపడం పనులకు రూ.1,00,101 విరాళాన్ని అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను బహూకరించారు.



ప్రకాష్‌నగర్ ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



ప్రకాష్ నగర్ ఈద్గాలో నమాజ్ చేయిస్తున్న మౌలానా షాహిద్ రహెజా



గుంటూరు రోడ్డు నాయబ్ బజారు పెద్ద మసీదులో ప్రార్థనలు

భాయ్.. ఈద్ ముబారక్ !

నియోజకవర్గంలో ముస్లింలు సోమవారం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల నుంచి చేస్తున్న ఉపవాస దీక్షలు విరమించారు. ఉదయాన్నే ఈద్గా, మసీదుల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రకాష్‌నగర్ ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. వరవకట్ట చిన్న మసీదుకు చెందిన మౌలానా షాహిద్ రహెజా ముస్లింలతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. గుంటూరు రోడ్డు నాయబ్ బజారులోని పెద్ద మసీదు, బరంపేట, ఇస్లాం పేట తదితర ప్రదేశాల్లోని మసీదుల్లో ముస్లింలు ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ముస్లింలకు పలువురు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

– నరసరావుపేట

విజనరీ మహామిథ్య

ఇచ్చిన హామీలెన్నో.. ఒక్కటీ నెరవేరలే !

- ఐటీ పార్కు ఎప్పుడు ఏర్పాటు చేస్తారో!
- సూపర్ సిక్స్ గాలికొదిలేసినట్లేనా ?
- చేనేతలను పట్టించుకోరా !
- నేడు సీఎం చంద్రబాబు బాపట్ల జిల్లాకు రాక

చీరాల: జిల్లాను సుందరంగా తీర్చిదిద్దుతా.. చేనేతలు, అన్నదాతలను ఆదుకుంటా.. ఐటీ హబ్ ఏర్పాటు చేస్తా.. అన్ని రంగాల్లో బాపట్ల జిల్లాను ముందంజలో నిలుపుతానని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారో అని ప్రజలు కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 10 నెలలు కావస్తున్నా బాపట్ల జిల్లాకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని ఆవేదన చెందుతున్నారు. గిట్టుబాటు ధరల్లేక అన్నదాతలు ఆక్రోశిస్తున్నారు. చేనేత రంగం ఆసరా కోసం అర్రులు చాస్తోంది. నిరుద్యోగులు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం నిరీక్షిస్తున్నారు. మత్స్యకార భరోసా అందక గంగపుత్రులు అల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం బాపట్ల జిల్లా చినగంజాం మండలం గొల్లపాలేనికి రానున్న దృష్ట్యా ఆయన ఇచ్చిన హామీల మాటేమిటని ప్రశ్నిస్తున్నారు. అమలు చేస్తారా? లేదా అని నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు.

చేనేతలకు చేయిచ్చిన చంద్రబాబు


చేనేత రంగానికి బాబు ప్రభుత్వం చేయిచ్చింది. బాపట్ల జిల్లాలోని చీరాల, పర్చూరు, వేమూరు, రేపల్లె నియోజకవర్గాలలో సుమారు 15 వేల మగ్గాల వరకు ఉండగా 20 వేల చేనేత కుటుంబాలు ఉన్నాయి. 50 శాతం చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. కనీస వేతన చట్టం ప్రకారం కార్మికుడికి రోజుకు రూ.206 చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈ కూలి కార్మికులకు అందడం లేదు. మగ్గాలపై పీస్ వర్క్ చేస్తున్నారనే కారణంతో కనీస వేతన చట్టం వర్తింపజేయలేమని కార్మికశాఖ చేతులెత్తేసింది. దీంతో హోటల్‌లో పని చేసే స్వీపర్ల కంటే చేనేత కార్మికుడికి కూలి తక్కువ వస్తోంది.. కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తే ప్రయోజనం ఉంటుంది.

రైతులకు ప్రోత్సాహం ఎక్కడ ?

అధికారంలోకి వస్తే రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 1,92,037 మంది రైతులకు రూ.384.07 కోట్లు ఇవ్వాల్సి ఉంది. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా నేటికీ అన్నదాతలను ఆదుకున్న దాఖలాలు లేవు. గత ప్రభుత్వం జిల్లాలో 1,92,037 మంది రైతులకు రూ.1187 కోట్లు ఇచ్చింది. ఖరీఫ్, రబీ సీజన్లో పెట్టుబడి సాయం ఇవ్వలేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించలేదు. చంద్రబాబు హామీతో పండించిన పంటలు దళారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ అన్నదాతలను నట్టేట ముంచుతున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

ఈ హామీల మాటేమిటీ బాబు..!

బాపట్ల జిల్లాను టూరిజం హబ్‌గా మారుస్తానని, కొమ్మమూరు కెనాల్ ఆధునికీకరిస్తామని, చీరాలకు ఐటీ హబ్ తీసుకొస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు అలవిగాని హామీలు ఇచ్చారు. అధికారం చేపట్టి ఇన్ని రోజులైనా వాటి గురించి పల్లెత్తి మాట్లాడడం లేదు.



మరిన్ని బూటకపు హామీలు

డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షల రుణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు, స్వయం ఉపాధికి రూ.10 వేల కోట్లు, రూ.5 వేల కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరణ తదితర పథకాలను కూటమి ప్రభుత్వం ప్రకటించింది. వీటి సంగతీ అతీగతీ లేదు.

ని‘యంత్రా’ణేదీ!

- యంత్రాలతో ఇసుక తవ్వకాలపై ఆందోళన
- గాజుల్లంక కృష్ణా నది వద్ద లారీలు నిలిపివేత
- భూగర్భ జలాలు అడుగంటడంపై నిరసన
- కూటమి నేతలు కూలీలకు పనులు దూరం చేయడంపై ధ్వజం



ఇసుక లారీలకు అడ్డుగా కూర్చుని నిరసన తెలుపుతున్న గాజుల్లంకకు చెందిన వ్యక్తి

కొల్లూరు : కూటమి నాయకులు యంత్రాలతో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టడంపై ప్రజలు ఆందోళనకు దిగారు. ఆదివారం రాత్రి గాజుల్లంక సమీపంలో భారీ యంత్రాలతో తవ్వి వందలాది లారీలలో తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. భారీ పొక్లెయిన్లు, జేసీబీలతో తవ్వకాలు చేపట్టడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగు, సాగు నీటి సమస్య ఉత్పన్నమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యంత్రాలతో తవ్వకాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని ధ్వజమెత్తారు. ఆదివారం రాత్రి 8 గంటల నుంచి మొదలైన ఆందోళన అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగింది. లారీలు భారీ సంఖ్యలో నిలిచిపోవడంతో క్వారీ నిర్వాహకుల అనుయాయులు చర్చలు జరిపారు. ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు నిరసనకారులు ఆందోళన విరమించారు. ఘటనాస్థలానికి చేరుకున్న మీడియా ప్రతినిధిపై క్వారీ నిర్వాహకుల అనుచరుడు ఒకరు బెదిరింపులకు దిగారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు స్పందించకపోవడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది.



అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి చిత్రం ప్రమోషన్‌లో భాగంగా నరసరావుపేట వచ్చిన హీరో కల్యాణ్‌రామ్‌కు త్రికోటేశ్వరస్వామి చిత్రపటం బహూకరణ

క్లుప్తంగా

రంజాన్‌కు జిల్లావ్యాప్తంగా పోలీసు భద్రత



నరసరావుపేట: ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) పండుగ సందర్భంగా సోమవారం జిల్లావ్యాప్తంగా మసీదులు, ఈద్గాల వద్ద పోలీసులు భద్రత ఏర్పాట్లు చేపట్టారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ బందోబస్తు విధులు నిర్వహించారు. పెద్ద ఎత్తున ముస్లింలు దర్గాలు, మసీదులు, ఈద్గాల వద్ద ప్రార్థనలు చేపట్టారు. ఈ సమయంలో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వాహనాల రాకపోకలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య



వినుకొండ: శావల్యాపురం, వినుకొండ రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై గుర్తు తెలియని వృద్ధుడు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మార్కాపురం నుంచి రేపల్లె వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 70 సంవత్సరాలు ఉంటుదని, తెల్ల రంగు నిండు చేతుల చొక్కా, నీలం రంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడని చెప్పారు.

అయోధ్య రాముడి ధనస్సు శోభాయాత్ర



తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన చల్లా శ్రీనివాస్‌శర్మ అయోధ్య రామ మందిరానికి విరాళంగా కిలో బంగారం, 10 కిలోల వెండితో తయారు చేయించిన ధనస్సు అందజేశారు. ఈ ధనస్సు శోభయాత్రను దేశవ్యాప్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యక్రమ నిర్వాహకులు కనసాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ఉండవల్లి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం కాపులబజార్‌లోని కోదండ రామాలయంలో భక్తుల దర్శనార్థం ఆ ధనస్సును ఉంచారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ శర్మ మాట్లాడుతూ దేశంలో ప్రతి హిందువు ఈ ధనస్సును దర్శనం చేసుకునేందుకు వీలుగా శోభాయాత్రను చేపట్టినట్లు పేర్కొన్నారు.

విద్యాలయాన్ని తరలిస్తే ఊరుకునేది లేదు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



ప్రభ పైనుంచి మాట్లాడుతున్న గోపిరెడ్డి

రొంపిచర్ల: కేంద్రీయ విద్యాలయాన్ని రొంపిచర్ల నుంచి తరలిస్తే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. రొంపిచర్లలో ఆదివారం రాత్రి శ్రీ బాలా త్రిపురసుందరీ సమేత శంకరేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా ఆలయంలో ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ ప్రభ పైనుంచి మాట్లాడారు. రొంపిచర్లలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. దీన్ని తరలించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, వాటిని తిప్పికొడతామని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రభుత్వపు మాటలు పత్రికలకే పరిమితమయ్యాయని చేతల రూపంలో లేవని విమర్శించారు. రాష్ట్రంలో తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసుకుందామని ఆయన పిలుపునిచ్చారు. అధైర్యపడవద్దని, పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. రొంపిచర్ల మండలం గోపిరెడ్డి గడ్డా.. జగన్ అడ్డా అని స్పష్టం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి కోసం మండల ప్రజలు ఏది చేయడానికైనా వెనుకడుగు వేయరని తెలిపారు. లోకేష్ రెడ్ బుక్ రాస్తుంటే ప్రతి గ్రామంలో మనం బ్లూబుక్‌ను రాద్దామని చెప్పారు. రాబోయేది వైఎస్సార్ పార్టీ ప్రభుత్వమేనని, జగన్, గోపిరెడ్డి 2.0 చూడబోతున్నారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఆయన, తనయుడు లోకేష్ తప్పా ఎవ్వరూ సంతోషంగా లేరని చెప్పారు. డాక్టర్ గోపిరెడ్డి రొంపిచర్లలో అడుగుపెట్టింది మొదలు నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా జేజేలు, నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



ముస్లింలకు ఈద్ ముబారక్ తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణలో తమవంతు సహకారం ముస్లింలకు ఉంటుందని, కేంద్రం ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లోని ఈద్గాలో నిర్వహించిన ఈద్-ఉల్-ఫితర్ నమాజ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లిం మత పెద్దలు, సోదరులతో కలిసి అల్లాకు ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలను ఆలింగనం చేసుకొని ఈద్-ముబారక్ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెలరోజుల పాటు భక్తి శ్రద్ధలతో ఉపవాసాలు ఉండి, ఐదుపూటలా నమాజ్ చేసి కోరికలు నెరవేరాలని, తమ కుటుంబాలతో పాటు దేశప్రజలు అందరూ సంతోషంగా ఉండాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తారని తెలిపారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ముస్లింలు స్నేహానికి, త్యాగానికి ప్రతీకని పేర్కొన్నారు. స్నేహం, త్యాగం, ప్రేమకు రంజాన్ గుర్తు అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు రద్దుచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీని కోసం ముస్లింలకు తన వంతు మద్దతు ఉంటుందని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ ఖాజావలి మాస్టారు, షేక్ ఖాదర్‌బాషా, సయ్యద్ ఖాదర్ బాషా, సయ్యద్ జాఫర్‌తో పాటు ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

బరి తెగించిన టీడీపీ నేతలు

వైఎస్సార్ సీపీ నాయకుల ఇళ్లపై దాడి ఇద్దరికి గాయాలు




దాడిలో గాయపడ్డ వైఎస్సార్ సీపీ నేతలు

బొల్లాపల్లి: పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుల ఇళ్లపై టీడీపీ వర్గీయులు దాడులకు పాల్పడ్డారు. ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల నాయకుడు ఆళ్ల సాంబిరెడ్డి, పాపిరెడ్డిల ఇళ్లపై దాడికి పాల్పడ్డారు. ఇందులో వారికి గాయాలయ్యాయి. ఈపూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. దాడి ఘటనపై బండ్లమోటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు రామగిరి నాసర్‌వలికి సంబంధించిన వ్యక్తులు తమ ఇంటిపై దాడికి పాల్పడ్డారని బాధితులు చెబుతున్నారు. ఈ విషయంపై బండ్లమోటు ఎస్ఐ ఎ. బాలకృష్ణను అడగ్గా ఆదివారం రాత్రి మండలంలోని మేళ్లవాగు గ్రామ తిరునాళ్లలో ఇద్దరి మధ్య స్వల్ప వివాదం జరిగిందని తెలిపారు. అనంతరం గుమ్మనంపాడులో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొని ఘర్షణకు దారి తీసిందని చెప్పారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు. ఆళ్ల సాంబిరెడ్డి, రామగిరి నాసర్‌వలి ఫిర్యాదులపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ప్రవీణ్ మృతిపై సమగ్ర న్యాయ విచారణ జరపాలి

సత్తెనపల్లిలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

సత్తెనపల్లి: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ సత్తెనపల్లి ప్రాంత సార్వత్రిక క్రైస్తవ సమాఖ్య, యునైటెడ్ పాస్టర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణంలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని తెలిపారు. కొన్నేళ్లుగా క్రైస్తవులపై దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రవీణ మృతిపై సీబీఐతో విచారణ చేసి ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ మరణం క్రైస్తవులను మనోవేదనకు గురి చేసిందని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఉయ్ వాంట్ జస్టిస్.. క్రైస్తవులపై దాడులు అరికట్టాలని నినాదాలు చేశారు. అనంతరం కొవ్వొత్తులు చేత పట్టుకొని తాలూకా సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. స్థానిక లూథరన్ చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీకు ముందుగా ప్రవీణ్ కుటుంబానికి ఆదరణ, ఓదార్పు కలగాలని దేవుని ప్రార్థించారు. ర్యాలీ తాలూకా సెంటర్, గడియార స్తంభం నుంచి ఐదు లాంతర్ల సెంటర్ వరకు సాగి తిరిగి లూథరన్ చర్చి వద్దకు చేరుకుంది. కార్యక్రమంలో సీయోన్ లూథరన్ చర్చి, బాగ్స్ మెమోరియల్ సెంటినరి బాప్టిస్ట్ చర్చి, సెంటినరి తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి, షాలెం చర్చి తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ మృతదేహం లభ్యం



ఆవుల కోటయ్య (ఫైల్)

పిడుగురాళ్ల: అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న వీఆర్‌ఏ ఆవుల కోటయ్య(50) మృతదేహం పిడుగురాళ్ల మండలంలోని జూలకల్లు లాకుల వద్ద సోమవారం లభ్యమైందని పట్టణ పోలీసులు తెలిపారు. బొల్లాపల్లి మండలం రెమిడిచర్ల గ్రామానికి చెందిన ఆవుల కోటయ్య వీఆర్‌ఏగా గ్రామంలో విధులు నిర్వహిస్తున్నాడు. అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురై ఈ నెల 29న భార్యకు, చిలకలూరిపేటలో ఉన్న మనవరాలికి వద్దకు వెళ్లి వస్తానని చెప్పి స్వగ్రామం నుంచి బయలుదేరారు. మార్గం మధ్యలో కారంపూడి సాగర్ బ్రిడ్జి నిలబడి మనవరాలికి వీడియో కాల్ చేసి చనిపోతున్నట్లు చెప్పి, సాగర్ కెనాల్‌లో దూకాడు. మనవరాలు చెప్పిన ఆధారంగా భార్య, ఇద్దరు కుమారులు, బంధువులు కలిసి కారంపూడి నుంచి నాగార్జున సాగర్ కుడి కాలువ వెతుకుతూ వస్తుండగా పిడుగురాళ్ల మండలంలోని జూలకల్లు లాకుల కింద కోటయ్య మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు.

రేపల్లె నుంచి దూర ప్రాంతాలకు సర్వీసులు నడపాలి

రేపల్లె రూరల్: తీర ప్రాంతమైన రేపల్లె నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులను నడపాలని పట్టణ ఆదర్శ వేదిక కార్యదర్శి యడ్లపల్లి కిషోర్‌బాబు విన్నవించారు. రేపల్లె ఆర్టీసీ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతూ డిపో వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణలకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రేపల్లె - విశాఖపట్నం - శ్రీకాకుళం, రేపల్లె - మచిలీపట్నం - కాకినాడ - విశాఖపట్టణం - శ్రీకాకుళం పోర్టు, రేపల్లె - తిరుపతి - బెంగళూరు, రేపల్లె - హైదరాబాద్ (బెర్త్‌తో కూడుకున్న బస్సులు)లతో పాటు శ్రీశైలం, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలకు సర్వీసులు నడపాలన్నారు. అదేవిధంగా మోపిదేవి మీదుగా చల్లపల్లికి మినీ సర్వీసులను ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎన్.సాయికృష్ణమాచార్యులు, కొడాలి ఆనందరావు, నటరాజ్ ఉన్నారు.



ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లకు వినతిపత్రం అందజేత

దండ కారణ్యంలో మారణకాండ ఆపాలి

పౌర హక్కులు, ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



ఆర్టీసీ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న పౌరహక్కులు, ప్రజా సంఘాల నాయకులు

నరసరావుపేట: దండకారణ్యంలో మారణకాండను వెంటనే నిలిపివేసి సుప్రీం కోర్టు న్యాయమూర్తితో ప్రభుత్వం విచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సోమవారం పౌర హక్కులు, ప్రజా సంఘాల నాయకులు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మధ్య భారతంలో, ముఖ్యంగా దండ కారణ్యంలో నిత్యం ఎన్‌కౌంటర్ల పేరుతో ఆదివాసీలు, మావోయిస్టులను హత్యలు చేస్తున్నారని తెలిపారు. ఆయుధాలతో మావోయిస్టులు సంచరిస్తే వారిని అరెస్ట్ చేయాలన్నారు. వేలాది మంది సాయుధ బలగాలు చుట్టుముట్టి మట్టు పెట్టడం, అణిచివేస్తాం, తుడిచేస్తాం అనే పదాలు రాజ్యాంగబద్ధం కాదని పేర్కొన్నారు. ఆరు నెలల పసి పిల్లలతో పాటు, యువకులు, మహిళలను పెద్దఎత్తున కాల్చి చంపడం, 2026 మార్చి 31 నాటికి అందరిని నిర్మూలిస్తామని హోం మంత్రి అమిత్‌షా బహిరంగ ప్రకటన చేస్తూ సవాల్ విసరడం చట్టబద్ధం, న్యాయబద్ధం కాదని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలలో మిలిటెంట్ సంస్థలతో కాల్పుల విరమణ ఒప్పందాలు చేసుకొని, వారి సమస్యలు పరిష్కరిస్తామని ప్రకటిస్తున్న పాలకులు మావోయిస్టులు, ఆదివాసీల విషయంలో వారిని నిర్మూలించడమే తమ లక్ష్యం అనడంలోనే దుర్బుద్ధి కనిపిస్తోందని వివరించారు. మధ్య భారతంలో ఉన్న ఖనిజాలు, అటవీ సంపదను తరలించుకపోవటానికి అంబానీ లాంటి కార్పొరేటర్లతో ఒప్పందాలు చేసుకున్నారన్నారు. వాటిని అమలు చేయాలంటే అక్కడ వీరు అడ్డమని, వారిని చంపడమే పరిష్కారమని పాలకుల భావిస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు దీంట్లో జోక్యం చేసుకొని న్యాయ విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు. 2024 జనవరి నుంచి నేటి వరకు 500 మందిని చంపేశారని, తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించి చర్చలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, పౌర హక్కుల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ వినుకొండ పేరయ్య పాల్గొన్నారు.

'కొండవీటి కళారేఖ' కావ్యావిష్కరణ



ఆవిష్కరణలో కల్లి శివారెడ్డి తదితరులు

నరసరావుపేట ఈస్ట్: కొండవీడు పాలకుల సాహితీ సేవ, ప్రజారంజక పాలనను చారిత్రక పద్య కావ్యంగా తీసుకురావడం అభినందనీయమని కొండవీడు కోట అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కల్లి శివారెడ్డి తెలిపారు. శ్రీనాథ సాహితీ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో విశ్రాంత ప్రిన్సిపాల్, పద్యకవి డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి రచించిన 'కొండవీటి కళారేఖ' చారిత్రక పద్య కావ్యాన్ని శివారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సాహితీలోకంలో డాక్టర్ చేరెడ్డి ధ్రువతారగా నిలిచిపోతారని కొనియాడారు. పుస్తక సమీక్షకులు డాక్టర్ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి, డాక్టర్ మేళ్లచెర్వు భానుప్రసాదు మాట్లాడుతూ మస్తాన్‌రెడ్డి కలం పట్టి పద్యం రాయడం మొదలు పెట్టి 60 వసంతాలు నిండాయని తెలిపారు. ఆయన రచించిన 'అఖండ యోగి' పాఠకుల మన్ననలు పొందిందని పేర్కొన్నారు. కొండవీటి కావ్యరేఖ సైతం అందరి హృదయాలలో నిలిచిపోతుందని వివరించారు. అనంతరం గాయత్రీ పరివార్ సత్సంగ్, సంస్కృత సంధ్యా, సద్గురు కళాసమితి ఆధ్వర్యంలో డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డిని పద్య కళానిధి బిరుదుతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, ఆయా సంస్థల ప్రతినిధులు డాక్టర్ పోపూరి గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ వేదాంతం సత్య శ్రీనివాస అయ్యంగార్, పి.వి.ఎస్.ఆర్. ప్రసాదరావు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్ట్



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు



స్వాధీనం చేసుకున్న గంజాయి

మూడు కిలోల గంజాయి స్వాధీనం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం, రాధారంగా నగర్, కొలనుకొండ ప్రాంతాల్లో నివాసముంటూ గంజాయి అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను తాడేపల్లి పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కల్యాణ్‌రాజు మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, నార్త్‌జోన్ డీఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు గంజాయి విక్రయాలు, కొనుగోలుపై దృష్టి సారించామని తెలిపారు. వడ్డేశ్వరం, రాధారంగానగర్‌కు చెందిన ముత్యాల మనోజ్ కుమార్ ఏజెన్సీ ఏరియాల నుంచి గంజాయి తీసుకువచ్చి వడ్డేశ్వరంలో నివాసముంటున్న షేక్ అమిద్ బాషా, కొలనుకొండకు చెందిన ప్రవీణ్‌తో కలసి గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్నారనే సమాచారం వచ్చిందని చెప్పారు. దీంతో వారిపై నిఘా పెట్టామన్నారు. ఎయిమ్స్ రోడ్‌లోని బ్రహ్మానందపురానికి వెళ్లే రహదారిలో ఈ ముగ్గురు గంజాయి అమ్మేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి వద్ద మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు ఆయన తెలిపారు. గంజాయి విక్రయించే వారు, తాగే వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

ఎడ్ల పందేల్లో అపశ్రుతి

- బండ్ల లాగుడు పోటీల్లో కాలుజారి పందెపు ఎద్దుకు ఫ్రాక్చర్
- 1962 అంబులెన్స్ వాహనంలో గన్నవరం తరలింపు



అంబులెన్స్ వాహనంలోకి చేర్చిన పందెపు ఎద్దు

తెనాలి: స్థానిక మార్కెట్ యార్డులోని జరుగుతున్న ఆలపాటి శివరామకృష్ణయ్య జాతీయస్థాయి ఎడ్ల పందేల్లో మూడోరోజైన సోమవారం రాత్రి అపశ్రుతి చోటుచేసుకుంది. జిల్లాలోని సత్తెనపల్లి దగ్గర్లోని కొమెరపూడి గ్రామానికి చెందిన యర్రా వెంకటేశ్వరరావు పందెపు జత బండలాగుడు పోటీల్లో పాల్గొన్నపుడు ఒక ఎద్దుకు కాలుజారి ఫ్రాక్చర్ అయింది. అక్కడే ఉన్న పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ (జేడీఏ) డాక్టర్ ఒ.నరసింహారావు పర్యవేక్షణలో పశువైద్యులు పరిశీలించి ప్రాథమిక వైద్యం చేశారు.

■ అత్యవసర శస్త్రచికిత్స కోసం గన్నవరంలోని పశువైద్య కళాశాలలోని సర్జరీ విభాగానికి తరలించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. మొబైల్ వెటరనరీ అంబులెన్స్ వాహనాన్ని రప్పించారు. తెనాలి వాహనంలో లిఫ్ట్ పనిచేయకపోవటంతో దుగ్గిరాల నుంచి 1962 మొబైల్ అంబులెన్స్‌ను పిలిపించారు. గాయపడిన ఎద్దును మొబైల్ వాహనంలోని లిఫ్ట్ సాయంతో అందులోకి ఎక్కించి, గన్నవరం తరలించారు.

■ మనుషులకు 108 అంబులెన్స్ వాహనం తరహాలోనే పశువులకు ప్రమాదం జరిగినపుడు అత్యవసర వైద్యసేవల కోసమని గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 1962 మొబైల్ అంబులేటరీ వెటరనరీ వాహనాలను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. గాయపడిన పశువుల వద్దకు నేరుగా వెళ్లి వైద్యం చేయడం, సాధ్యం కాకపోతే పశువును లిఫ్ట్ చేసి, ఆసుపత్రికి తరలించి వైద్యం చేసేందుకు వీటిని వినియోగిస్తున్నారు. ఇప్పుడు పొరుగు జిల్లాకు వెళ్లడం నిబంధనలకు విరుద్ధమైనా, పరిస్థితి తీవ్రతతో ఉన్నతాధికారులు, ఈఎంఆర్ఐను జేడీఏ డాక్టర్ నరసింహారావు ఫోనులో సంప్రదించి, వారి అనుమతితో తరలించారు. తెనాలి పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగిరెడ్డి, డాక్టర్ జి.నరేంద్ర, ఆలపాటి వెంకట్రామయ్య, సిబ్బంది సహకరించారు.

తెనాలి వైద్యశాలలో అరుదైన సర్జరీ

- తొడల మధ్యలో ఇరుకున్న ఆటో హ్యాండిల్‌ను తొలగించిన వైద్యులు
- వ్యక్తికి తప్పిన ప్రాణాపాయం



హ్యాండిల్‌తో వైద్యశాలకు వచ్చిన ప్రసాద్

తెనాలిఅర్బన్: రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు ఆటో హ్యాండిల్ రెండు తొడల మధ్య ఇరుకున్న ఓ వ్యక్తికి ఆపరేషన్ చేసి ప్రాణప్రాయాన్ని తప్పించారు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల వైద్యులు. సేకరించిన వివరాలు, వైద్యుల కథనం ప్రకారం.. తెనాలి పట్టణంలోని సుల్తానాబాద్‌కు చెందిన ప్రసాద్ (28) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం ఆటోనగర్ వైపు తన ఆటోలో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ప్రసాద్ నడుపుతున్న ఆటో హ్యాండిల్ అతని రెండు తొడల మధ్యలో ఇరుక్కుపోయింది. ఎంత సేపు ప్రయత్నించి హ్యాండిల్ బయటకు రాకపోవడంతో స్థానికులు దానిని కట్ చేసి, అతడిని జిల్లా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ జె.హనుమంతరావు రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం సెలవు అయినప్పటికీ హుటాహుటిన వైద్యశాలకు వచ్చారు. ఓపీ నుంచి అదే స్ట్రక్చర్‌పై థియేటర్‌కు తీసుకువెళ్లి అత్యవసర శస్త్ర చికిత్స చేశారు. రెండు తొడల మధ్యలో ఇరుకున్న హ్యాండిల్‌ను తొలగించడంతో పాటు లోపల దెబ్బతిన్న నరాలను కూడా సరిచేసి కుట్లు వేశారు. వెంటనే సర్జరీ చేయడంతో ప్రాణపాయం తప్పినట్లు వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్సలో ఆర్థోపెడిక్ వైద్యులు వెంకటేశ్వరరావు, ఎనస్తీషియా వైద్యులు యశస్వి, డాక్టర్ తులసీ పాల్గొన్నారు. రోగి తరపు బంధువులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఏకాదండయ్య పంతులు జీవితం స్ఫూర్తిదాయకం

గుంటూరు ఎడ్యుకేషన్: ఎనిమిది దశాబ్దాల క్రితం ట్రస్ట్ ఏర్పాటు చేసి విద్య, వైద్య, ఆధ్యాత్మిక, ఆదరణ గృహాల ద్వారా సమాజ హిత సేవలందించిన ఏకాదండయ్య పంతులు జీవితం వర్తమాన, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎన్ఆర్ఎల్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఏకాదండయ్య పంతులు చారిటీస్ ఆధ్వర్యంలో సోమవారం అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాల సుధర్మ ఆడిటోరియంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో భాగంగా పంచాంగాన్ని ఆవిష్కరించారు. రాళ్లబండి వెంకట సత్య రామాంజనేయ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఏకాదండయ్య పంతులు బహుముఖ సేవలను కొనియాడారు. ప్రముఖ వైద్యులు వి.రమణరావు కమలవల్లి దంపతులను ఘనంగా సత్కరించి సన్మాన పత్రం అందజేశారు.